గౌరవస్థానం

రేడియో కొన్నతర్వాత రాఘవరావుకూ రాజేశ్వరికీ వారి పిల్లలకూ దానితోడిదే లోకమైపోయింది. ఏ రోజుకారోజు నవనవమైన కార్యక్రమాలు వినడమూ వానిని గురించి మళ్లీ మళ్లీ చెప్పుకోడమూ విమర్శించుకోడమూ వాదించుకోడమూ. ఒకటేమిటి అంతా రేడియో లోకమే.

సాయంత్రం నాలుగు గంటలైంది. విజయవాడ రేడియో పేరంటం కార్యక్రమం వినడానికి త్వరత్వరగా కాఫీలు ఫలహారాలు ముగించుకొని వచ్చి కుర్చీలో కూర్చున్నది రాజేశ్వరి. "ఆహా! తయారైనావూ మీ స్త్రీల కార్యక్రమం వినడమంటే నీకెంత సరదా. ఎంత పనైనా మానుకొని వస్తావన్నాడు" రాఘవరావు నవ్వుతూ. "రేడియో పెట్టండి. యివ్వాళ చాలా ముఖ్యమైన విషయమున్నది," అన్నది రాజేశ్వరి. "ఏమి టేమి" టన్నాడు రాఘవరావు. "స్వతంత్ర భారతవర్షంలో స్త్రీల స్థానము. గురించి ఒక విదుషీమణి ప్రసంగ ఉన్నదన్నది. రాజేశ్వరి ప్రారంభ గీతమైన తర్వాత ప్రసంగం ప్రారంభమైనది. సతీపతులిద్దరు శ్రద్ధగా విన్నారు—భారత రాజ్యాంగ చట్టంలో స్త్రీలకు పురుషులతో సమానంగా లభించిన హక్కులు బాధ్యతలు ఉపన్యాసకురాలు ఎంతో చక్కగా వివరించింది. ఆఁ యీ కాగితాలమీద వ్రాయబడినహక్కులకేమిలే అన్నట్టు రాజేశ్వరి అసంతృప్తిగా ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది. వెంటనే రాఘవరావు ఆమె వంక మందహాసంతో చూస్తూ "ఇకనేమీ మీ రొట్టె నేతిలో పడ్డదన్నమాటే. మీరు పురుషులతోబాటు సమానముగు ఏ హక్కులు కావలెనని పదింపదిగా తీర్మానిస్తున్నారో అవన్నీ వచ్చేసినాయి" అన్నాడు.

"రొట్టె నేతిలో పడంగానే ఏం సంబరము, చేతిలో పడొద్దూ?" అన్నది రాజేశ్వరి.

"నేతిలో పడ్డది చేతిలోకి రాకేం చేస్తుంది. స్త్రీ అన్న కారణంగా ఎందునూ నిషేధించరాదు—చదువులు, ఉద్యోగాలు, ఆస్తి హక్కులు, వోటు హక్కులు ప్రాతినిధ్యపు హక్కులు ఒకటేమిటి అన్నీ వచ్చాయిగా?"

"ఈ రావడానికేమిలెండి?"

"రాబట్టే గవర్నరులు, మంత్రులు రాయబారిణులు, శాసన సభల్లో సభ్యతలు, స్పీకర్లు—ఓ అన్నీ చేస్తున్నారు."

"పదహారుకోట్ల నలభైలక్షల స్త్రీలల్లోను వీరన్ని వేలవంతూ?"

"ఓహో అందరికి రాలేదనా నీ కోపం? మగవాళ్లు మాత్రం అందరూ మహోన్నత పదవుల్లోనే ఉన్నారూ."

"అదే నేను చెప్పేదీనీ? స్త్రీలైనా పురుషులైనా ఏ పదిమందో గొప్ప ఉద్యోగాలు చేస్తే ఏమి జరిగింది. అయినా మీ మగవారితో మాకు సాటేమిటండీ. మావన్నీ కాగితాలమీది హక్కులు"

"ఎవరికైనా కాగితములమీద వ్రాసిన తర్వాతనేగా అమలులోకి వచ్చేది? ఇప్పుడు ఏ స్త్రీయైనా ఒక ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే స్త్రీలకు యివ్వబడదని త్రోసివేయడానికి వీలవుతుందా?

"చూడండీ. లంచాలు పుచ్చుకొనే ఉద్యోగస్థులను బ్లాకుమార్కెట్టు సాగించే వ్యాపారస్థులనూ శిక్షించడానికీ ఎన్నో చట్టాలున్నాయి శిక్షాస్మృతిలో. అయితేనేమీ

> మనదేశంలో స్త్రీల కష్టాలు "లా" కు బద్ధం కానివి, శాసనాలకు లొంగనివి. వానిని రాజ శాసనాలు పరిష్కారం చెయ్యలేవు. స్త్రీ పురుషుల మధ్య బానిసయజమాని భావం వున్నంతవరకు శాసనరూపేణ హక్కులు వచ్చినా అవి కాగితం మీది హక్కులుమాత్రమే.

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

చట్టానికి కానరాని వెలుతులేవో వారి ఆశలను పూరిస్తూనే ఉన్నాయి. దొంగకు తోడుపొయ్యే పిచ్చిదేశం మనది."

"అయితే ఏమంటావు?"

"చట్టాలు ప్యాసైతే చాలదంటాను."

"ముందు శాసనాలైతేగాదూ తర్వాత ఉద్యోగాలు వచ్చేది?"

"ఉద్యోగా లెవరికి కావాలండీ?"

"అయితే ఏమి కావాలె"

"గౌరవస్థానం."

"పదవితోబాటు అదీ వస్తుంది."

"పదవిలో ఉన్న, ఏ పదిమందో ఆ పదవి ఉన్నన్నాళ్లు రోజులూ గౌరవింపబడితే స్త్రీ సంఘమంతా గౌరవింపబడినట్లేనా? కాదుగా. స్త్రీ అనే వ్యక్తికే గౌరవం రావాలె."

"ఆఁహా! అయితే సరే ఎప్పటికీ తరుగూ ఒరుగూ లేని శాశ్వతమైన గౌరవస్థానం రావలెనంటావు. ఆడపిల్ల అనేది మాతృ గర్భంలోంచి బయటికి వచ్చి కాల గర్భంలో కలిసిపోయేవరకూ ఒక్క విధమైన గౌరవం రావాలెనంటావు. భేష్—"

"మీ రిట్లా ఆక్షేపిస్తే నేను చెప్పలేను."

"అబ్బ! ఇదే నీతో వచ్చిన చిక్కు ప్రసంగం మధ్యలో యిట్టే కోపం తెప్పించుకొని సంభాషణకు అంతరాయం కల్పిస్తావు ఇంతకు—నేనేమన్నాను? మీరు ఎన్నాళ్లనుంచో సమాన హక్కులు కావాలెనంటున్నారు గనుక అవి వచ్చేశాయన్నాను."

"ఏమి వచ్చాయి? మన దేశంలో స్త్రీల కష్టాలు లాకుబద్ధం కానివి. శాసనాలకు లొంగనివీని. వానిని రాజశాసనాలు పరిష్కారం చెయ్యలేవు. నిజం చెప్పవలసివస్తే మన దేశంలో పురుషులకు స్త్రీలను గౌరవంగా చూడటము తెలియదు. స్త్రీని మన్నించడం న్యూనతగాగూడా భావిస్తారు—ఒక స్త్రీని చిన్నబుచ్చడమంటే అలవోకగా సరదాగా చేస్తారు."

"నీవు పొరబడుతున్నావు. మన పురాణాల్లో త్రిమూర్తుల భార్యలకున్న గౌరవం ఎవరికున్నది? మన దేశంలో మాతృస్థానంలో స్త్రీకివున్న పూజ్యత ఎక్కడున్నది?"

"త్రిమూర్తుల భార్యల కథలూ ధర్మ శాస్త్రాల్లోని శ్లోకాలు బాగానే ఉండవచ్చును కాని ప్రస్తుతం ఆచరణలో ఉన్న విషయం చూడండి."

"ఆచరణలో మాత్రం?"

"అవును మీకేమి తెలుస్తుంది మీరు అపోజిషన్ పార్టీవారు"

"నీవి వట్టి అపోహాలు. ఇప్పుడు స్త్రీల గౌరవం చాలా హెచ్చింది."

"చట్టాల ఆడంబరముచూచి మీరట్లా అభిప్రాయపడుతున్నట్టున్నారు. మీ రైన్నన చెప్పండి పురుషులు స్త్రీలను చులకనగా చూడటంలో లవలేశమైనా మార్పు కలగలేదు."

"తార్కాణం?"

"వేలు లక్షలు."

"ఉదాహరణకొక్కటి."

"ఆధునికులు వ్రాసే కథలు చదవండి, కావ్యాలు చదవండి. పత్రికలు చదవండి. ప్రహసనాలు చదవండి నాటకాలు చదవండి. సినిమాలు చూడండి నాటకాలు చూడండి పురణాలు వినండి హరికథలు వినండి. పాటలు వినండి పద్యాలు వినండి. చదువుకొనే విద్యార్థినిని చూడండి స్త్రీ యెంత చులకనగా చూడబడుతున్నదో తెలుస్తుంది. ఎదుటి మనిషి స్త్రీ గదా. మనమేమన్నా మళ్లీ ఎదురు తిరిగి అనదుగదా. మనమెట్లా మాట్లాడినా పరవాలేదని చూస్తున్నారేగాని ఇందువల్ల తమ గౌరవమెంత వమ్మై పోతున్నదో చూచుకోడంలేదు పురుషులు. ప్రతి క్రియా విరహితలైన స్త్రీలంటే మగవారికంత తేలిక. ఆ సంగతులన్నీ అట్లా ఉంచండి. ఇంట్లోనైనా భార్యను మన్ననగా చూచే భర్త ఒక్కడైన మచ్చునకైనా కనిపిస్తాడేమో."

"ఆ, నే నుండగానే ఎంత అన్యాయానికి ఒడి గట్టావు!"

"(నవ్వుతూ) మీరు మహా మన్నిస్తున్నారు."

"మన్నింపకచేసే దేమున్నది? "పడతుకలయొద్ద మగవారు బానిసీలు"

"ఆఁ యీ వ్రాతలకేమి మీ వంటి భావ కవులుంటే యిట్లాంటి వెన్నైనా వ్రాస్తారు."

"ఇది నేను వ్రాసిందికాదు."

"మీవంటివారు వేరొకరు. నూతన రాజ్యాంగ చట్టం ప్రకారం. స్త్రీకి చదువుకోడానికీ, ఉద్యోగాలు చేయడానికీ ఆస్తి పాస్తులు అనుభవించడానికీ, వోట్లు నివ్వడానికీ శాసనసభల్లో ప్రవేశించడానికీ స్థానాధికారాలు చలాయించడానికీ అధికారాలు వచ్చాయి యిక మీకేమి తక్కువని మీరంటున్నారు—నిజంగా మనకన్నీ వచ్చినాయని స్త్రీలు అనుకుంటున్నారు. కాని స్త్రీ పురుషుల మధ్యనున్న యజమాని బానిసభావం అట్లాగే వున్నది. అందువల్ల అతని నిరంకుశత్వం ఆమెపై బహుముఖాలుగా చెలాయింపబడుతునే ఉన్నది. ఆమెను పుట్టింటికి తరిమివేస్తునే ఉన్నాడు. అక్కడనుండి ఏమేమో కట్టుకురమ్మని నిర్బంధిస్తునే ఉన్నాడు. ఆమెను పరిత్యజించి పునః వివాహం చేసుకుంటూనే ఉన్నాడు. ఆమె సలహా పాటించకుండా ఆస్తిపాస్తులు తగలేస్తునే ఉన్నాడు. తన సహధర్మిణియైన ఆ వ్యక్తిని గుర్తించకుండా నిరంకుశంగా ప్రవర్తిస్తున్నాడు. ఆమెను జోగిని చేయతలచుకుంటే జోగినీ భోగిని చేయతలుచుకుంటే భోగినీ చేయడం యింకా అతని చేతులలోనే ఉన్నది. స్త్రీగూడా మనిషేననీ, ఆమెకు హృదయం ఉన్నదనీ, తెలివితేటలున్నవనీ, యుక్తాయుక్త పరిజ్ఞాన మున్నదనీ, ఆమెను తనతో సమానంగా చూడటం తన ధర్మమనీ పురుషునకు తోచడమేలేదు. ఈ తలంపు పురుషుని హృదయంలో కలగనప్పుడు స్త్రీకి గౌరవమెట్లా వస్తుంది? ఏ చట్టాలు వీరిని రక్షిస్తాయి. అందువల్లవే మహాత్ముడు ప్రతి సంస్కరణకూ మనః పరివర్తన ముఖ్యమంటూ ఉండేవాడు. దీనికీ అంతే."

"ఆహాహా! ఏమి మహోపన్యాసము. నీ ప్రసంగం గూడా రేడియోకెక్కిస్తే బాగా ఉండును. మీ స్త్రీలంతా విని ఆనందిస్తారు."

"మీరుమాత్రం సంతోషించరన్నమాట."

"నేను అపోజిషనుపార్టి వాడనని యిందాకనే అన్నావుగా. నేను సంతోషిస్తానంటే నమ్ముతావూ."

"ఇంతకూ ఈ స్త్రీ హైన్యతకంతకూ కీలకం ఒకటే ఉన్నది."

"ఏమిటో అదిగూడ వినిపిస్తె"

"స్త్రీకి ఆర్థికోపపత్తి లేదు. అందువల్లనే స్వయం వ్యక్తిత్వంగూడా లేదు—ఎప్పుడైతే స్త్రీ ఒకరి పెట్టుపోతలుమీద ఆధారపడి ఉన్నదో అప్పుడే ఆమె బ్రతుకు తేలికైపోయింది—"

"బరువెక్కడానికి నీవే ఏదో ఉపాయం సూచించూ"

"తన్ను దాను పోషించుకోడం నేర్చుకోవాలె"

"సరిసరి యిదా నీ సూచన? పాటకపు స్త్రీ లందరూ తమ్ము దాము పోషించుకొనేవాళ్లే—వాళ్లేం సుఖంగా ఉంటున్నారు?"

"వాళ్లే నయం. సంపన్న కుటుంబినులూ, మధ్య కుటుంబినులు—పురుషుల పోషణ తప్పితే అధోగతిపాలై పోతున్నారు. వాళ్లకు స్వయం పోషణశక్తి ఉండాలి. ఇంతకూ స్త్రీని తనతో సమానమగు స్థాయిలో మిత్రురాలివలె పురుషుడు చూడాలె. అప్పుడే స్త్రీ పురుషు లిరువురికి సౌఖ్యమూ కలుగుతుంది, దేశం అభివృద్ధిలోకి వస్తుంది. కుటుంబాల్లో శాంతి భద్రతలు చేకూరితే దేశానికి శాంతి భద్రతలు చేకూరినట్లే."

"అయితే యీ క్లిష్ట సమస్య భద్రతా సంఘానికి నివేదించవలసిందే."

"ఎందుకూ? కాశ్మీర సమస్యకు తోడుగా ఉంటుందనా?

"కాదుకాదు వాళ్లు బాగా చర్చించి యీ విధంగా మెలగండని మా పురుషులకు సూచిస్తే ఆ విధంగా మెలగుదామని."

"అదికాదులెండి. అక్కడా మనవాళ్లేనని మీయెత్తు" రాఘవరావు పకాలున నవ్వాడు.

★